Toli Velugu 26.01.26_Layout 1 1/26/2026 8:55 AM Page 1


జాతీయ దిన పత్రిక

# తొలివెలుగు

మన భాష.. మన పత్రిక..

నిజామాబాద్ | సంపుటి : 01 | సంచిక : 18 | పేజీలు : 4 | సోమవారం 26 జనవరి 2026 | వెల : 2/-





# పద్మ అవార్డులు ప్రకటించిన కేంద్రం

డెస్క్, జనవరి 25 (తొలివెలుగు) : ప్రముఖ సినీ నటులు, నటకిరీటి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, సీనియర్ నటుడు, మాజీ ఎంపీ మాగంటి మురళీ మోహన్‌లకు ప్రతిష్ఠాత్మక పద్మశ్రీ పురస్కారం లభించింది. కళారంగంలో వారు అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం వారిని ఈ అత్యున్నత పౌర పురస్కారంతో గౌరవించింది. 2026 సంవత్సరానికి గాను గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ శనివారం రాత్రి పద్మ పురస్కారాల జాబితాను విడుదల చేసింది.

ఈ ఏడాది మొత్తం 131 మందిని పద్మ అవార్డులు వరించాయి. ఇందులో 5 పద్మ విభూషణ్, 13 పద్మ భూషణ్, 113 పద్మశ్రీ పురస్కారాలు ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల నుంచి



పలువురు ప్రముఖులు ఈ జాబితాలో చోటు దక్కించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి రాజేంద్ర ప్రసాద్, మురళీ మోహన్‌లతో పాటు, మరణానంతరం గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ (కళలు), వెంపటి కుటుంబ శాస్త్రి (సాహిత్యం, విద్య)లకు పద్మశ్రీ లభించింది. తెలంగాణ నుంచి

- 2026 సంవత్సరానికి పద్మ పురస్కారాల ప్రకటన
- వివిధ రంగాలకు చెందిన 113 మంది ప్రముఖులకు పద్మశ్రీ అవార్డులు
- తెలుగు రాష్ట్రాల నుంచి మురళీ మోహన్, దీపికా రెడ్డి, గద్దె రాజేంద్ర ప్రసాద్‌లకు పురస్కారం
- మరణానంతరం గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్, రామారెడ్డి మామిడిలకు గౌరవం
- క్రీడాకారులు రోహిత్ శర్మ, హర్మన్‌ప్రీత్ కౌర్‌లకు పద్మశ్రీ

చంద్రమౌళి గడ్డమనుగు (సైన్స్ అండ్ ఇంజనీరింగ్), దీపికా రెడ్డి (కళలు), గూడూరు వెంకట్ రావు (వైద్యం) సహా పలువురు ఈ గౌరవాన్ని అందుకున్నారు.

## రాజ్యాంగమే మనకు మార్గదర్శి..

### - రిపబ్లిక్ డే ముంగిట రాష్ట్రపతి ప్రసంగం



- గణతంత్ర దినోత్సవ పూర్వ సంధ్యలో జాతినుద్దేశించి ప్రసంగించిన రాష్ట్రపతి
- న్యాయం, సోదరభావమే గణతంత్రానికి పునాదులని స్పష్టం చేసిన ద్రౌపది ముర్ము
- దేశాభివృద్ధిలో మహిళలు, రైతులు, శాస్త్రవేత్తల పాత్రను కొనియాడిన రాష్ట్రపతి
- అంబేద్కర్ సందేశాన్ని, సాయుధ దళాల శౌర్యాన్ని ప్రత్యేకంగా గుర్తుచేశారు
- రాజ్యాంగంలో పొందుపరిచిన విలువలే ప్రభుత్వానికి మార్గదర్శకమని ఉద్ఘాటన

2

## ఈ పురస్కారాలు రాబోయే తరాలకు గొప్ప స్ఫూర్తినిస్తాయి - కేటీఆర్



డెస్క్ జనవరి 25 (తొలివెలుగు) : కేంద్రప్రభుత్వం 2026 సంవత్సరానికి గానూ ప్రకటించిన ప్రతిష్ఠాత్మక పద్మ పురస్కారాల్లో తెలంగాణకు చెందిన ఏడుగురు ప్రముఖులకు పద్మశ్రీ అవార్డులు లభించడం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు హర్షం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా మొత్తం 131 మందికి పురస్కారాలు ప్రకటించగా, అందులో తెలంగాణ నుంచి వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారికి సముచిత స్థానం దక్కడం రాష్ట్ర ప్రజలందరికీ గర్వకారణమని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా కేటీఆర్ స్పందిస్తూ... సైన్స్, వైద్యం, కళలు, పశుసంవర్ధక వంటి భిన్న రంగాల్లో తెలంగాణ ప్రతిభ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం ఎంతో సంతోషాన్నిచ్చిందన్నారు. సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో చంద్రమౌళి గడ్డమానుగు, కృష్ణమూర్తి బాలసుబ్రహ్మణియన్, కుమారస్వామి తంగరాజ్‌లకు; వైద్య రంగంలో డాక్టర్ గూడూరు వెంకట్ రావు, డాక్టర్ పాలకొండ విజయ్ ఆనంద్ రెడ్డిలకు, కళల విభాగంలో కూచిపూడి నృత్యకారిణి దీపికా రెడ్డికి పద్మశ్రీలు దక్కాయని గుర్తుచేశారు. పశుసంవర్ధక రంగంలో విశేషసేవలు అందించిన మామిడి రామారెడ్డికి మరణానంతరం ఈ పురస్కారం ప్రకటించడం ఆయన నిస్వార్థ సేవకు దక్కిన నిజమైన గౌరవమని అభిప్రాయపడ్డారు. క్షేత్రస్థాయిలో నిశ్శబ్దంగా సమాజం కోసం పనిచేసే వారిని గుర్తించి గౌరవించడం అభినందనీయమని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ పురస్కారాలు కేవలం వ్యక్తులకు దక్కిన గౌరవంగానే కాకుండా, రాబోయే తరాలకు గొప్ప స్ఫూర్తినిస్తాయని ఆకాంక్షించారు. తెలంగాణ గడ్డపై పుట్టిన ప్రతిభావంతులు తమ తమ రంగాల్లో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి, దేశ కీర్తిని మరింత ఇనుమడింపజేయాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. పురస్కార గ్రహీతలందరికీ, వారి కుటుంబ సభ్యులకు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

## ప్రియుడి భార్యకు హెచ్ఐవీ వైరస్ ఇంజెక్షన్ ఇచ్చిన మహిళ

- ప్రియుడి భార్యకు హెచ్ఐవీ వైరస్ ఇంజక్షన్ ఇచ్చిన వైనం
- కర్నూలులో ఘటన సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించిన పోలీసులు
- మాజీ ప్రియురాలితో పాటు మరో నలుగురు అరెస్టు



వివరాలు 2 లో..

## తిరుమలలో రథసప్తమి వైభవం..

### – సప్తవాహనాలపై మలయప్ప స్వామి

- తిరుమలలో వైభవంగా రథసప్తమి మహోత్సవం
- ఒకేరోజు ఏడు వాహనాలపై విహరించనున్న మలయప్ప స్వామి
- ఉదయం సూర్యప్రభ వాహన సేవతో వేడుకలు ప్రారంభం
- 10 టన్నుల పుష్పాలతో ఆలయంలో ప్రత్యేక అలంకరణ
- రాత్రి చంద్రప్రభ వాహనంతో ముగియనున్న ఉత్సవాలు



డెస్క్, జనవరి 25 (తొలివెలుగు) : తిరుమల క్షేత్రంలో రథసప్తమి మహోత్సవం కన్నుల పండువగా జరుగుతోంది. సూర్య జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న ఈ వేడుకను "ఒకేరోజు బ్రహ్మోత్సవం"గా అభివర్ణిస్తారు. ఈ ఉత్సవంలో భాగంగా శ్రీమలయప్ప స్వామివారు సూర్యోదయం నుంచి చంద్రోదయం వరకు ఏడు ప్రధాన వాహనాలపై తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిస్తున్నారు. తెల్లవారు జామున మూలవిరాట్టుకు కైంకర్యాలు పూర్తి చేసిన అనంతరం, ఉదయం 5:30 గంటలకు మలయప్ప స్వామిని వాహన మండపానికి తీసుకొచ్చారు. అక్కడ ప్రత్యేక పూజల తర్వాత, సూర్యోదయానికి ముందే సర్కారు హారతితో వాహనసేవ ప్రారంభ మైంది. తొలి సేవగా..

2

## సింగరేణి స్కామ్‌లో సీఎం రేవంత్ సూత్రధారి

### – హరీశ్ రావు సంచలన ఆరోపణలు

- సింగరేణిలో భారీ అవినీతి జరిగిందన్న హరీశ్ రావు
- సీఎం రేవంత్ సూత్రధారని, ఆయన బావమరిది లబ్ధిదారుడని ఆరోపణ
- సైట్ విజిట్ సర్టిఫికెట్ టెండర్లను రద్దు చేసి, సీబీఐ విచారణ జరపాలని డిమాండ్
- సింగరేణి లాభాలను దాచిపెట్టి కార్మికుల బోనస్ తగ్గించారని విమర్శ
- అవినీతిపై కేంద్రం మౌనం వీడాలని, బీజేపీ-కాంగ్రెస్ కుమ్మక్కయ్యాయని ఆరోపణ



డెస్క్, జనవరి 25 (తొలివెలుగు) : సింగరేణి కాలరీస్‌లో భారీ అవినీతి జరిగిందని, దీని వెనుక సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. 'సైట్ విజిట్ సర్టిఫికెట్' నిబంధనతో జారీ చేసిన టెండర్లన్నింటినీ తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివారం మీడియాతో మాట్లాడిన ఆయన, ఈ కుంభకోణంపై జ్యుడీషియల్ లేదా సీబీఐ విచారణ జరపాలని కోరారు. ఈ కుంభకోణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే సూత్రధారి అని, ఆయన బావమరిది సృజన్ రెడ్డి ప్రధాన లబ్ధిదారుడని హరీశ్ రావు ఆరోపించారు. నైనీ టెండర్‌ను రద్దు చేయడమే ఇందులో తీవ్ర అక్రమాలు జరిగాయనడానికి నిదర్శనమని అన్నారు. సీఎంకు సన్నిహితులైన కాంట్రాక్టర్లకు ప్రయోజనం చేకూర్చేందుకే టెండర్ నిబంధనలను మార్చారని విమర్శించారు.



Toli Velugu 26.01.26_Layout 1 1/26/2026 8:55 AM Page 2



# రాజ్యాంగమే మనకు మార్గదర్శి..

## - రిపబ్లిక్ డే ముంగిట రాష్ట్రపతి ప్రసంగం

మొదటిపేజీ తరువాయి..
డెస్క్, జనవరి 25 (తొలివెలుగు) : గణతంత్ర దినోత్సవ వేడుకలకు దేశం సిద్ధమవుతున్న వేళ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆదివారం సాయంత్రం జాతినుద్దేశించి ప్రసంగించారు. న్యాయం, సోదరభావం అనే రెండు కీలకమైన అంశాలను మన రాజ్యాంగం నిర్వచించిందని, అవే గణతంత్రానికి పునాదులని ఆమె స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న దార్శనికత, రాజ్యాంగంలో పొందుపరిచిన విలువలను ఆమె తన ప్రసంగంలో ప్రముఖంగా ప్రస్తావించారు.

దేశాభివృద్ధి ప్రయాణంలో మహిళలు కీలక మైలురాళ్లను సృష్టిస్తున్నారని, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తున్నారని రాష్ట్రపతి ప్రశంసించారు. దేశ భద్రతకు కాపలా కాస్తున్న సాయుధ బలగాల శౌర్య పరాక్రమాలను కొనియాడుతూ, 'ఆపరేషన్ సిందూర్'ను ఆమె గుర్తుచేశారు. దేశ పురోభివృద్ధికి దోహదపడుతున్న రైతులు, శాస్త్రవేత్తలు, వైద్యులు, సైనిక, పోలీసు సిబ్బంది, వ్యాపారవేత్తలు, యువత సేవలను ఆమె ప్రత్యేకంగా అభినందించారు.

ప్రజాస్వామ్యాన్ని పటిష్టం చేయడానికి ఎన్నికలలో పాల్గొనడం పౌరుల బాధ్యత అని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఇచ్చిన సందేశాన్ని రాష్ట్రపతి ఈ సందర్భంగా గుర్తుచేశారు. వందేమాతరం 150వ వార్షికోత్సవ వేడుకలతో పాటు సర్దార్ పటేల్, నేతాజీ సుభాష్ చంద్రబోస్‌లకు నివాళులర్పించిన కార్యక్రమాలను కూడా ఆమె ప్రస్తావించారు.

భారత ప్రజాస్వామ్య క్యాలెండర్‌లో అత్యంత ముఖ్యమైన ఈ వార్షిక ప్రసంగం దేశవ్యాప్తంగా కోట్లాది మంది పౌరులకు చేరింది. ఆదివారం రాత్రి 7 గంటలకు ప్రారంభమైన ఈ ప్రసంగాన్ని ఆకాశవాణి జాతీయ నెట్‌వర్క్‌తో పాటు అన్ని దూరదర్శన్ ఛానెళ్లలో ప్రసారం చేశారు. మొదట హిందీలో, ఆ తర్వాత ఆంగ్లంలో రాష్ట్రపతి ప్రసంగించారు. అనంతరం, దూరదర్శన్ ప్రాంతీయ ఛానెళ్లు వివిధ ప్రాంతీయ భాషలలో ఈ సందేశాన్ని ప్రసారం చేశాయి. దీనివల్ల దేశంలోని వివిధ రాష్ట్రాల ప్రజలు తమ మాతృభాషలో రాష్ట్రపతి సందేశాన్ని వినే అవకాశం కలిగింది.

గణతంత్ర భారతదేశం ఆవిర్భవించిన తొలి నాళ్ల నుంచి రాష్ట్రపతి ప్రసంగం ఒక సంప్రదాయంగా కొనసాగుతోంది. ఇది దేశ ప్రగతి, విజయాలు, సవాళ్లను సమీక్షించుకోవడానికి ఒక అవకాశంగా నిలుస్తుంది. 1950లో భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన చారిత్రక రోజుకు గుర్తుగా గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఆ రోజునే మన దేశం సార్వభౌమ, ప్రజాస్వామ్య గణతంత్రంగా అవతరించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రపతి ప్రసంగం, జనవరి 26 వేడుకలకు స్ఫూర్తిదాయకమైన స్వరాన్ని అందిస్తూ, ఐక్యత ప్రాముఖ్యతను మరోసారి గుర్తుచేసింది.

# ప్రియుడి భార్యకు హెచ్ఐవీ వైరస్ ఇంజెక్షన్ ఇచ్చిన మహిళ

మొదటిపేజీ తరువాయి..
డెస్క్, జనవరి 25 (తొలివెలుగు) : తాను ప్రేమించిన వ్యక్తి వేరొకరిని వివాహం చేసుకున్నాడనే ఆగ్రహంతో, అతని భార్యను లక్ష్యంగా చేసుకుని ఓ మాజీ ప్రియురాలు దారుణానికి ఒడిగట్టిన ఘటన కర్నూలు నగరంలో సంచలనం రేపింది. ఈ మేరకు కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్ వెల్లడించిన వివరాల ప్రకారం.. కర్నూలుకు చెందిన ఒక వైద్యుడు ఆదోనికి చెందిన యువతితో కొంతకాలం ప్రేమ వ్యవహారం కొనసాగించి, ఆ తరువాత విడిపోయారు. అనంతరం ఆ వైద్యుడు మరో మహిళా వైద్యురాలిని వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం ఆయన భార్య కర్నూలు వైద్య కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తుండగా, ఆయన కర్నూలులోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో పనిచేస్తున్నారు.

ఈ నేపథ్యంలో, తాను ప్రేమించిన వ్యక్తి మరొకరిని పెళ్లి చేసుకోవడాన్ని జీర్ణించుకోలేకపోయిన మాజీ ప్రియురాలు, ఆ దంపతులను విడదీయాలనే దురుద్దేశంతో



పథకం పన్నినట్లు పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో, ఈ నెల 9న విధులను ముగించుకుని మధ్యాహ్నం ఇంటికి వెళుతున్న మహిళా వైద్యురాలిపై నలుగురు వ్యక్తులతో దాడి చేయించినట్లు విచారణలో తేలింది. ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఆమెను ఉద్దేశపూర్వకంగా ఢీకొట్టి కింద పడేసిన నిందితులు, సహాయం చేస్తున్నట్లు నటిస్తూ ఆటోలో ఎక్కించి ఒక వైరస్ (హెచ్ఐవీ) ఇంజెక్షన్ ఇచ్చినట్లు డీఎస్పీ తెలిపారు.

ఈ ఘటనపై బాధితురాలి భర్త పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, కర్నూలు 3వ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సంఘటనా స్థలంలోని సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించి, మాజీ ప్రియురాలితో పాటు మరో నలుగురిని అరెస్టు చేశారు. అరెస్టు చేసిన నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ బాబు ప్రసాద్ వెల్లడించారు. ఈ ఘటన నగరంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# నాంపల్లి అగ్నిప్రమాదం..

## మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా



డెస్క్, జనవరి 25 (తొలివెలుగు) : హైదరాబాద్‌లోని నాంపల్లిలో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు తెలంగాణ ప్రభుత్వం అండగా నిలిచింది. మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందిస్తామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ఈ ఘటన అత్యంత దురదృష్టకరమని, ఐదుగురు ప్రాణాలు కోల్పోవడం తనను తీవ్రంగా కలచివేసిందని ఆయన విచారం వ్యక్తం చేశారు. నిన్న నాంపల్లి స్టేషన్ రోడ్డులోని బచ్చా క్యాజిల్ ఫర్నిచర్ మాల్‌లో ఈ ఘోర ప్రమాదం చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ప్రకటించిన నష్టపరిహారాన్ని తక్షణమే అందించేలా చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందనకు మంత్రి పొంగులేటి ఆదేశాలు జారీ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, అగ్నిమాపక భద్రతా నిబంధనలను కఠినంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ప్రాథమిక విచారణలో షాపు యజమాని నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు తేలిందని మంత్రి వెల్లడించారు. ఇప్పటికే సంబంధిత వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని, ఘటనకు బాధ్యులైన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

# తిరుమలలో రథసప్తమి వైభవం..

## - సప్తవాహనాలపై మలయప్ప స్వామి




మొదటిపేజీ తరువాయి..
సూర్యప్రభ వాహనంపై స్వామివారు భక్తులను అనుగ్రహించారు. దీని తర్వాత చిన్నశేష, గరుడ, హనుమంత, కల్పవృక్ష, సర్వభూపాల వాహనాలపై ఊరేగింపు కొనసాగుతుంది. రాత్రి చంద్రప్రభ వాహన సేవతో ఈ మహోత్సవం ముగుస్తుంది. రథసప్తమి నేపథ్యంలో ఆలయ మహాద్వారం నుంచి స్వామివారి సన్నిధి వరకు తిరుమాడ వీధులను శోభాయమానంగా అలంకరించారు. ఇందుకోసం సుమారు 10 టన్నుల సంప్రదాయ పుష్పాలు, రంగురంగుల విద్యుత్ దీపాలను వినియోగించారు. స్వామివారి వాహన సేవలను వీక్షించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో తిరుమాడ వీధులు కిటకిటలాడుతున్నాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేసింది.

# ఏబీఎన్ ఛానెల్‌లో జరిగే చర్చల్లో ఇక నుంచి బీఆర్ఎస్ నాయకులు పాల్గొనరు

## - బీఆర్ఎస్ అధికారిక ప్రకటన

డెస్క్, జనవరి 25 (తొలివెలుగు) : ఏబీఎన్-ఆంధ్రజ్యోతి మీడియా సంస్థలను బహిష్కరిస్తున్నట్టు బీఆర్ఎస్ పార్టీ సంచలన నిర్ణయం తీసుకుంది. ఇకపై ఏబీఎన్ ఛానెల్‌లో జరిగే చర్చా కార్యక్రమాల్లో తమ పార్టీ నేతలు పాల్గొనరని, అలాగే తమ పార్టీ కార్యాలయాల్లోకి ఆ సంస్థ ప్రతినిధులను అనుమతించబోమని అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు బీఆర్ఎస్ పార్టీ ఓ ప్రకటన విడుదల చేసింది. తెలంగాణ ఉద్యమకారుడు, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు పట్ల ఏబీఎన్ ఛానెల్ ప్రతినిధి వెంకటకృష్ణ వ్యవహరించిన తీరుకు నిరసనగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు బీఆర్ఎస్ తన ప్రకటనలో పేర్కొంది. తెలంగాణ ఏర్పడిన తొలినాళ్లలోనే రాష్ట్ర నాయకత్వం పట్ల ఆంధ్రజ్యోతి అసభ్యకరంగా వ్యవహరించిన చరిత్ర ఉందని కూడా పార్టీ ఆరోపించింది.


భారత రాష్ట్ర సమితి
BHARAT RASHTRA SAMITHI
Office : Telangana Bhavan, Road No : 10, Banjara Hills, Hyderabad 500 034.

Date: 25-01-2026

పత్రికా ప్రకటన

23-01-2026 నాడు ఏబీఎన్ ఆంధ్రజ్యోతి చానెల్‌లో జరిగిన ఒక చర్చా కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ ఉద్యమకారులు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ శ్రీ తక్కళ్లపల్లి రవీందర్ రావు గారి పట్ల ఆ చానెల్ ప్రతినిధి వెంకటకృష్ణ వ్యవహరించిన తీరును భారత రాష్ట్ర సమితి తీవ్రంగా ఖండిస్తున్నది.

గౌరవ శాసనమండలి సభ్యుడిని "గెట్ ఔట్ ఫ్రం మై చానెల్" అని సదరు టీవీ చానెల్ వ్యాఖ్యాత అనడం కనీస పాత్రికేయ విలువలకు, ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం.

డిబేట్‌కు పిలిచిన అతిథి మీద అనుచితమైన వ్యాఖ్యలు చేసినందుకు ఎమ్మెల్సీ శ్రీ తక్కళ్లపల్లి రవీందర్ రావు గారికి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని ఆంధ్రజ్యోతి చానెల్‌ను డిమాండ్ చేస్తున్నాం.

తెలంగాణ వచ్చిన తొలినాళ్లలోనే రాష్ట్ర నాయకత్వం పట్ల అసభ్యకరంగా వ్యవహరించిన చరిత్ర ఆంధ్రజ్యోతికి ఉన్నది. తదనంతర కాలంలో కూడా అనేకసార్లు భారత రాష్ట్ర సమితి నాయకుల మీద అసత్య కథనాలు ప్రచురించడం/ప్రసారం చేయడం, తెలంగాణ ప్రయోజనాలకు నష్టం వాటిల్లే విధంగా కథనాలు ప్రచురించడం/ప్రసారం చేయడం ఆంధ్రజ్యోతి గ్రూప్ పదే పదే చేస్తున్నది.

బీఆర్ఎస్ పట్ల, తెలంగాణ పట్ల ఆంధ్రజ్యోతి వైఖరి మారకపోవడం వల్ల ఇకపై బీఆర్ఎస్ నాయకులు ఎవరూ ఏబీఎన్ చానెల్‌లో జరిగే చర్చల్లో పాల్గొనరాదని నిర్ణయించాం. పార్టీ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లో కానీ, జిల్లా కార్యాలయాల్లో కానీ జరిగే పార్టీ సమావేశాలకు ఏబీఎన్ ఆంధ్రజ్యోతి చానెల్ ప్రతినిధులను ఇకపై అనుమతించరాదని పార్టీ నిర్ణయించడం జరిగింది.

సోమ భరత్ కుమార్
(పార్టీ ప్రధాన కార్యదర్శి, బీఆర్ఎస్)

ఈ నేపథ్యంలోనే పార్టీ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్‌తో పాటు, జిల్లా కార్యాలయాల్లో జరిగే సమావేశాలకు ఏబీఎన్, ఆంధ్రజ్యోతి ఛానెల్ ప్రతినిధులను అనుమతించరాదని నిర్ణయించినట్లు స్పష్టం చేసింది. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని పార్టీ వర్గాలు తెలిపాయి. దీంతో బీఆర్ఎస్, ఏబీఎన్-ఆంధ్రజ్యోతి మధ్య వివాదం మరింత ముదిరినట్లయింది.

Toli Velugu 26.01.26_Layout 1 1/26/2026 8:55 AM Page 3



# ఆర్యన్ కిడ్స్ వరల్డ్ ప్రారంభించిన సర్పంచ్ వెంకట్ పాపిరెడ్డి



వలిగొండ, జనవరి 25 (తొలివెలుగు) : వలిగొండ పట్టణ కేంద్రంలోని సుంకిశాల రోడ్డులో ఏర్పాటు చేసిన ఆర్యన్ కిడ్స్ వరల్డ్‌ను ఆదివారం వలిగొండ సర్పంచ్ కుంభం వెంకట్ పాపిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వలిగొండ మండల కేంద్రంలో తొలిసారిగా ఏర్పాటు చేసిన కిడ్స్ వరల్డ్‌ను తల్లిదండ్రులు, పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చిన్నారులకు వినోదంతో పాటు అభివృద్ధికి దోహదపడే విధంగా ఈ కేంద్రం ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగారం సర్పంచ్ ఎండి. సాలేహా సలీం, వంగాల అశోక్, కొండూరు సాయి తదితరులు పాల్గొన్నారు.

# నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కుంభం



వలిగొండ, జనవరి 25 (తొలివెలుగు) : వలిగొండ మండలం మాందాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల కింద రూ.20 లక్షలు, డీఎంఎఫ్ నిధుల కింద రూ.5 లక్షల వ్యయంతో ఈ భవనాన్ని నిర్మించారు. గ్రామ సర్పంచ్ దంతూరు యాదమ్మ ఆంజనేయులతో కలిసి ప్రారంభోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా ప్రతి గ్రామాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. అనంతరం వలిగొండ, మాందాపురం సహా మండలంలోని 14 గ్రామాల్లో నిర్మించనున్న మహిళా సంఘ భవనాలకు శంకుస్థాపన చేశారు. గ్రామపంచాయతీ భవనానికి స్థలం విరాళంగా ఇచ్చిన సోలిపురం చెన్న కృష్ణారెడ్డి, ఉపేందర్ రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి, మాజీ జడ్పీటీసీ కుసంగి రాములు, మాజీ సర్పంచ్ సోలిపురం సాగర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# కలెక్టర్ హనుమంతరావుకు ‘ఉత్తమ ఎన్నికల అధికారి’ పురస్కారం

- ‘బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీస్’ విభాగంలో గుర్తింపు
- గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా పురస్కార ప్రధానం
- సమిష్టి కృషితోనే అవార్డు సాధ్యమన్న కలెక్టర్ హనుమంతరావు




భువనగిరి, జనవరి 25 (తొలివెలుగు) : జిల్లా కలెక్టర్ హనుమంత రావుకు రాష్ట్రస్థాయి ఉత్తమ ఎన్నికల అధికారి పురస్కారం దక్కింది. 16వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని 2025 సంవత్సరానికి గాను ఎన్నికల నిర్వహణలో విశేష ప్రతిభ కనబరిచిన అధికారుల జాబితాను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి. సుదర్శన్ రెడ్డి శనివారం ప్రకటించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ హనుమంత రావు ‘బెస్ట్ ఎలక్టరల్ ప్రాక్టీస్’ విభాగంలో ఉత్తమ ఎన్నికల అధికారి అవార్డును అందుకున్నారు. ఈ పురస్కారం ద్వారా యాదాద్రి భువనగిరి జిల్లాకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు లభించింది. జిల్లాలో ఎన్నికల ప్రక్రియను సమర్ధవంతంగా, పారదర్శకంగా నిర్వహించినందుకు ఈ గౌరవం దక్కిందని అధికారులు తెలిపారు. జిల్లాకు ఈ పురస్కారం రావడం పట్ల జిల్లా అధికారులు, ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియలో కీలక పాత్ర పోషించిన ఎన్నికల అధికారులు, సిబ్బంది, ఎన్నికల నిర్వహణలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. సమిష్టి కృషి వల్లనే జిల్లాకు ఈ అవార్డు సాధ్యమైందని పేర్కొన్నారు.

# ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం





ఆత్మకూర్ (ఎం), జనవరి 25 (తొలివెలుగు) : ఆత్మకూర్ మండల కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయంలో తహసీల్దార్ లావణ్య ఆధ్వర్యంలో ఆదివారం 16వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, సీనియర్ సిటిజన్స్, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాధాన్యతను గుర్తిస్తూ, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని, ఎన్నికల్లో తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కొత్తగా నమోదైన యువ ఓటర్లకు ఓటరు గుర్తింపు కార్డులు అందజేయగా, క్రమం తప్పకుండా ఓటు వినియోగిస్తున్న సీనియర్ సిటిజన్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సఫీయుద్దీన్, ఆర్ఐ మల్లికార్జునరావు, ఏఆర్ఐ వెంకటేశ్వర్లు, జిపిఓలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 34వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా అవకాశం ఇవ్వండి : షేక్ జహీర్



సూర్యాపేట జిల్లా కేంద్రం, జనవరి 25 (తొలివెలుగు) : కాంగ్రెస్ పార్టీ నుంచి సూర్యాపేట మున్సిపాలిటీ 34వ వార్డు హుబాబ్ నగర్ కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని సూర్యాపేట సీనియర్ జర్నలిస్ట్ షేక్ జహీర్ (జలాల్) కాంగ్రెస్ నాయకత్వాన్ని కోరారు. ఈ మేరకు మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణా రెడ్డి సమక్షంలో ఏఐసీసీ సభ్యులు సర్వోత్తమ్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. గత కొన్నేళ్లుగా హుబాబ్ నగర్ పరిధిలో ప్రజలతో మమేకమై సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న విషయాన్ని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా షేక్ జహీర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాల మేరకు ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్నానని తెలిపారు. 34వ వార్డు అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, పేదల సంక్షేమం కోసం కౌన్సిలర్‌గా అవకాశం ఇస్తే అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. అలాగే వార్డు ప్రజల మద్దతు, సహకారంతో ఈ ప్రయత్నాన్ని ముందుకు తీసుకెళ్లాలని కోరారు.

# పలు రంగాల్లో సేవ చేసిన వ్యక్తులకు జాతీయ పురస్కారాలు అందజేస్తూ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ అభినందనలు



హనుమకొండ జిల్లా, జనవరి 25 తొలివెలుగు) : వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి పలు రంగాల్లో విశేష కృషి చేసిన వ్యక్తులను గుర్తించి జాతీయ పురస్కారాలు అందజేయడం అభినందనీయమని అన్నారు. ఆదివారం తెలుగు వెలుగు సాహితీ వేదిక స్వచ్ఛంద సేవా సమితి ఆధ్వర్యంలో గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో స్వామి వివేకానంద, నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతులను పురస్కరించుకొని జాతీయ పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి , ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య హాజరయ్యారు. నిర్వాహకులతో కలిసి అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, స్వామి వివేకానంద, సుభాష్ చంద్రబోస్ వంటి మహనీయుల ఆశయాలు సమాజానికి ఎప్పటికీ మార్గదర్శకమని తెలిపారు. వారి పేర్లతో జాతీయ పురస్కారాలు ప్రదానం చేయడం ద్వారా సేవాభావాన్ని ప్రోత్సహించిన నిర్వాహకులను ఆయన అభినందించారు. భవిష్యత్తులో సంస్థకు తనవంతు సహకారం అందిస్తానని కూడా తెలిపారు. అనంతరం వివిధ రంగాల్లో సేవలందించిన పలువురు వ్యక్తులకు జాతీయ పురస్కారాలను అతిథులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్, డాక్టర్ వంగాల శాంతికృష్ణ ఆచార్య, పోలోజు రాజ్ కుమార్ ఆచార్య, డాక్టర్ వంగల మోహన రావు తదితరులు పాల్గొన్నారు.

Toli Velugu 26.01.26_Layout 1 1/26/2026 8:55 AM Page 4



# వేడుకగా శ్రీ భావన ఋషి - బద్రావతి దేవి కళ్యాణం

- మార్కండేయ స్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలు
- 40వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా వేడుక
- కళ్యాణాన్ని వీక్షించిన వేలాది మంది భక్తులు

చౌటుప్పల్, జనవరి 25 (తొలివెలుగు) : చౌటుప్పల్ మున్సిపాలిటీలోని శ్రీ శివ భక్త మార్కండేయ స్వామి దేవస్థాన ప్రాంగణం భక్తిపారవశ్యంతో నిండిపోయింది. 40వ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన శ్రీ భావన ఋషి బద్రావతి దేవి కళ్యాణ మహోత్సవం కనుల పండువగా సాగింది. బడుగు జయప్రకాష్, గోశిక బాల నరసింహ దంపతులు కళ్యాణ క్రతువులో పాల్గొనగా, ఆలయ అర్చకులు గంజి నరసింహులు బృహ శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా వివాహ వేడుక జరిపించారు. ఆర్థికంగా, వస్తురూపేణా సహకరించిన దాతలకు ఆలయ మర్యాదలతో శేష వస్త్రాలు అందజేశారు. ఈ వేడుకలో దేవస్థాన అధ్యక్షుడు బడుగు జయప్రకాష్, ప్రధాన కార్యదర్శి గోశిక బాల నరసింహ, ఉపాధ్యక్షులు నోముల రఘునాథ్, గోశిక బాలాజీ, సహాయ కార్యదర్శి గోలి శ్రీనివాస్, గోశిక చంద్రకళ నరసింహ, కోశాధికారి బడుగు సుజాత నర్సింహ, సాంస్కృతిక కార్యదర్శి బడుగు క్రాంతి కుమార్, ప్రచార కార్యదర్శి కర్నాటి జనార్ధన్, సమన్వయ కార్యదర్శులు గుర్రం సంతోష్ కుమార్, బాల్యం అనిల్ కుమార్, ధర్మకర్తల మండలి సభ్యులు కందగట్ల బిక్షపతి, బడుగు లక్ష్మయ్య, చిక్క నరసింహ, గోశిక అంజయ్య, బడుగు శ్రీరాములు, గోశిక విఠలేశ్వర్, గుర్రం వెంకటేశం,





గోశిక స్వామి, వనం ధనుంజయ, గుర్రం పాండురంగ, గోశిక నరసింహతో పాటు దేవాలయ ప్రధాన అర్చకులు గంజి నరసింహులు బృహశర్మ పాల్గొన్నారు.

# జర్నలిస్టు జహీర్‌కు 'ఇంటర్నేషనల్ పీస్' పురస్కారం

- సామాజిక సేవ, జర్నలిజంలో ప్రతిభకు గుర్తింపు
- పురస్కారాన్ని ప్రదానం చేసిన మనం ఫౌండేషన్

హైదరాబాద్ / సూర్యాపేట, జనవరి 25 (తొలివెలుగు) : సూర్యాపేట జిల్లాకు చెందిన సీనియర్ జర్నలిస్టు ఎస్.కె. జహీర్ ప్రతిష్టాత్మక 'ఇంటర్నేషనల్ పీస్ 2025' పురస్కారానికి ఎంపికయ్యారు. సామాజిక సేవ, శాంతి, ఐక్యత కోసం ఆయన చేస్తున్న కృషిని గుర్తిస్తూ హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న 'మనం ఫౌండేషన్' ఈ అవార్డును ప్రకటించింది. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జహీర్‌కు ఈ పుర-స్కారాన్ని ఘనంగా ప్రదానం చేశారు. జర్నలిజం వృత్తిలో ఉంటూనే పేద విద్యార్థులకు, అనాథలకు, వైద్య సహాయం అవసరమైన వారికి జహీర్ అందిస్తున్న సేవలను ఫౌండేషన్ ప్రతినిధులు కొనియాడారు. గ్రామీణ సమస్యలను వెలుగులోకి తెచ్చి పరిష్కరించడంలో ఆయన చూపిన చొరవ అభినందనీయమని పేర్కొన్నారు.




# ఓటు వజ్రాయుధం.. చైతన్య పరిచిన విద్యార్థులు

- చౌటుప్పల్‌లో ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం
- ర్యాలీలో పాల్గొన్న రెవెన్యూ, విద్యాశాఖ అధికారులు




చౌటుప్పల్, జనవరి 25 (తొలివెలుగు) : భారత ఎన్నికల సంఘం సూచనల మేరకు 16వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఆదివారం చౌటుప్పల్ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కేజీబీవీ పాఠశాల విద్యార్థులతో కలిసి రెవెన్యూ, విద్యాశాఖ అధికారులు భారీ ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రం నుంచి ప్రారంభమైన ర్యాలీ వలిగొండ రోడ్డు వరకు కొనసాగింది. ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు "ఓటు మన హక్కు", "ఓటు వజ్రాయుధం" అంటూ నినాదాలు చేస్తూ ప్రజల్లో ఓటు హక్కు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు, సిబ్బందితో అధికారులు ఓటర్ల ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి గురవారావు, నాయబ్ తహశీల్దార్ పి. సిద్ధార్థ కుమార్, ఆర్ఐ కె. సుధాకర్ రావు, బూత్ లెవల్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# పురపాలిక చట్ట సవరణ కాంగ్రెస్ గెలుపుతోనే సాధ్యం


- తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ చాంబర్స్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు



హైదరాబాద్/చౌటుప్పల్, జనవరి 25 (తొలివెలుగు): తెలంగాణ రాష్ట్రంలో నిర్వీర్యమైన పురపాలక చట్టానికి సమూల మార్పులు రావాలంటే రానున్న పురపాలక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాల్సిన అవసరం ఉందని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ చాంబర్స్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని మున్సిపల్ చాంబర్స్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం పైశాచిక ఆనందంతో పుర కౌన్సిళ్లను నిర్వీర్యం చేసి, స్థానిక సంస్థల్లో ఎన్నికైన ప్రజా ప్రతినిధులను తీవ్ర మానసిక ఒత్తిడికి గురిచేసిందని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా ప్రతినిధులకు కనీస గౌరవం, అధికారాలు ఇవ్వకుండా ప్రజల ముందు దోషులుగా నిలబెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. పురపాలక చట్టాల వల్ల ప్రజా ప్రతినిధుల ఉనికే ప్రమాదకరంగా మారిందన్నారు. మున్సిపల్ చట్టం ప్రక్షాళన జరగాలి, ప్రజా ప్రతినిధుల ప్రాధాన్యత పెరగాలంటే కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాల్సిన పరిస్థితి రాష్ట్రంలో ఏర్పడిందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో మున్సిపల్, పంచాయతీరాజ్ చట్టాలను విచ్ఛిన్నం చేసి ప్రజా ప్రతినిధుల ఉనికే ప్రశ్నార్థకంగా మార్చారని విమర్శించారు. రాజీవ్ గాంధీ కలలు గన్న 73, 74 రాజ్యాంగ సవరణల ఆత్మకు అనుగుణంగా స్థానిక సంస్థలకు అధికారాలు రావాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. 2019లో చేసిన పురపాలిక చట్ట సవరణల కారణంగా ఉన్నత వర్గాలు, మేధావులు స్థానిక సంస్థల ఎన్నికలకు దూరమయ్యారని, పేద వర్గాలు అవగాహన లేక గౌరవం కోసం పోటీ చేసి మానసికంగా, ఆర్థికంగా నష్టపోతున్న పరిస్థితి నెలకొందని అన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధుల అధికారాలు, గౌరవాన్ని దెబ్బతీసి అధికారులకే అన్ని అధికారాలు అప్పగించడంతో ప్రజా ప్రతినిధులు నామమాత్రంగా మిగిలిపోయారని విమర్శించారు. చట్ట సవరణలు లేకపోతే భవిష్యత్‌లో స్థానిక ప్రజా ప్రతినిధులే లేకుండా పోయే ప్రమాదం ఉందన్నారు. బీఆర్ఎస్‌కు మరో అవకాశం ఇస్తే ప్రజా ప్రతినిధులను పూర్తిగా పక్కన పెట్టే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగుతోందని, అధికారాలు, గౌరవం, చట్ట ప్రక్షాళన కాంగ్రెస్‌తోనే సాధ్యమని స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తే చట్టాలపై సమగ్ర అధ్యయనం చేసి అవసరమైన మార్పులు తీసుకురావచ్చని చెప్పారు. పురపాలక సంఘాలపై ఉన్న అజమాయిషీ అధికారాలను కలెక్టర్ల నుంచి సీడీఎంఏకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలను పరిశీలించి తెలంగాణలో చట్టాలను పునఃసమీక్షించాల్సిన అవసరం ఉందన్నారు. పట్టణాభివృద్ధి కోసం గతంలో ఎన్నడూ లేని విధంగా టీడీఎస్ నిధులు రూ.2800 కోట్లు, మౌలిక సదుపాయాల కల్పన కోసం మరో రూ.2700 కోట్లు విడుదల చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతోందని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ చాంబర్స్ ప్రతినిధులు అల్లంపల్లి నర్సింహా, చందు తదితరులు పాల్గొన్నారు.

# చలమల్ల కృష్ణారెడ్డి ఆర్థిక ఊతం.. బాధితులకు లక్ష సాయం

- సాయం అందించిన మాజీ పీసీసీ ప్రధాన కార్యదర్శి చలమల్ల కృష్ణారెడ్డి



సంస్థాన్ నారాయణపురం, జనవరి 25 (తొలివెలుగు) : యాదాద్రి భువనగిరి జిల్లా, సంస్థాన్ నారాయణపురం మండల పరిధిలోని కొత్తగూడెం గ్రామపంచాయతీ గోగులోనిబాయ్ గ్రామానికి చెందిన కల్లెం జంగారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ పీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి చలమల్ల కృష్ణారెడ్డి తన ప్రతినిధుల ద్వారా బాధిత కుటుంబానికి రూ. 1 లక్ష ఆర్థిక సాయం ప్రకటించారు. ఆదివారం కృష్ణారెడ్డి ప్రతినిధులు గ్రామాన్ని సందర్శించి, జంగారెడ్డి కుటుంబ సభ్యులకు లక్ష రూపాయల చెక్కును అందజేశారు. ఆపద కాలంలో అండగా నిలిచిన చలమల కృష్ణారెడ్డికి బాధితులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

# మేడారం ఏర్పాట్లపై క్షేత్రస్థాయిలో సమీక్షించిన మంత్రి సీతక్క

## - భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు



ములుగు జిల్లా/ మేడారం, జనవరి 25 (తొలివెలుగు) : శ్రీ సమ్మక్క--సారలమ్మ మహాజాతర సమీపిస్తున్న నేపథ్యంలో మేడారంలో చేపడుతున్న అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల ఏర్పాట్లను రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి ధనసరి అనసూయ (సీతక్క ) క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు సకాలంలో పూర్తయ్యేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి తెలిపారు. ఈ నేపథ్యంలో ఆదివారం మంత్రి సీతక్క జిల్లా కలెక్టర్ శ్రీ దివాకర టి.ఎస్., జిల్లా ఎస్పీ శ్రీ సుధీర్ రామ్ నాథ్ కేకన్‌లతో కలిసి మేడారం పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ఇందులో భాగంగా చిలకలగుట్ట ప్రాంతాన్ని సందర్శించి భక్తుల రాకపోకలు, భద్రతా ఏర్పాట్లు, మౌలిక సదుపాయాల పరిస్థితిని పరిశీలించారు. అనంతరం ట్రైబల్ మ్యూజియాన్ని సందర్శించి అక్కడ చేపడుతున్న పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, మద్యం సేవించి జంపన్న వాగులోకి వెళ్లవద్దని భక్తులను సూచించారు. మేడారం చేరుకున్న వెంటనే జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించి అనంతరం అమ్మవార్ల దర్శనం చేసుకుని వంటావార్పు నిర్వహించుకోవాలని తెలిపారు. రద్దీ ఎక్కువగా ఉండే సమయాల్లో భక్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జాతర సమయంలో చిన్నపిల్లలు, వృద్ధులను ఒంటరిగా వదిలివేయకూడదని, కుటుంబ సభ్యులు అందరూ కలిసే ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. ఎవరికైనా దారి తప్పిన పక్షంలో వెంటనే సమీపంలోని పోలీసు సిబ్బంది లేదా అధికారులను సంప్రదించాలని సూచించారు. జాతరకు వచ్చే లక్షలాది మంది భక్తులకు తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, దర్శన సౌకర్యాలు వంటి అంశాల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ముఖ్యంగా భక్తుల భద్రతకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమతి రేగ కళ్యాణి, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.